220 కేంద్రాలు.. 1500 సిబ్బంది

- తుది దశకు పోలింగ్ ఏర్పాట్లు
- అదనపు విధులకు మరో 300 మంది
- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం



శిక్షణ తరగతులకు హాజరైన అధికారులు, సిబ్బంది



సికింద్రాబాద్: శాసనసభ ఎన్నికల కోసం జీహెచ్ఎంసీ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలోని 220 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్న అధికారులు అక్కడి పరిస్థితులు అధ్యయనం చేశారు. ఈ నెల 30న జరగనున్న పోలింగ్ కోసం విస్తృతంగా పర్యటించిన అధికారులు పోలింగ్ కేంద్రాలు, బూత్‌లలో అవసరమైన ఏర్పాట్ల కోసం కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్.ఎల్లారెడ్డి నేతృత్వంలో ఐదుగురు సహాయక ఎన్నికల అధికారులు ఎన్నికల ఏర్పాట్లు సమీక్షిస్తున్నారు.

నియామక ప్రక్రియ పూర్తి..

ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు, సిబ్బంది నియామక ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు నియామకం పూర్తి చేశారు. పోలింగేతర సిబ్బందితో కలిపి సుమారు 1500 మందిని వినియోగించుకునే ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు సిబ్బందిని నియమించారు. అవసరమైన అధికారులు, సిబ్బందికి అదనంగా మరో వంద మంది వరకు నియమించుకున్నారు. వీరితో పాటు పర్యవేక్షణ, సహాయ పర్యవేక్షణ, సంచారక బృందాలు తదితర విభాగాలకు అధికారులు, సిబ్బందిని మరో 300 మందిని నియమించినట్లు అధికారులు చెబుతున్నారు.

పూర్తయిన శిక్షణ..

ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. ఈ నెల 17, 20 తేదీల్లో మరో రెండు మార్లు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు చెప్పారు. పోలింగ్‌రోజు ఉదయం వీరు ఎలక్ట్రానిక్ మెషిన్‌లు స్వాధీనం చేసుకోవడం, పోలింగ్ పూర్తయ్యాక సీజ్ చేసి తిరిగి అప్పగించడం వరకు ఈవీఎంల పట్ల పోలింగ్ విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందికి అవగాహన కలిగిస్తున్నారు.

స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటు..

సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు జరిగే ఎన్నికల నిర్వహణ నుంచి కౌంటింగ్ వరకు గల వ్యవహారాలన్నీ ఓయూ నుంచి కొనసాగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే ఓయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు చేరుకున్నాయి. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన మీదట తదుపరి వ్యవహారాలన్నీ ఓయూ స్ట్రాంగ్‌రూమ్ నుంచే కొనసాగించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఓయూ పోలీసులు స్ట్రాంగ్‌రూమ్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

నిబంధనలు పాటించాలి..



ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అందరూ సహకరించాలి. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. ఎన్నికల నిర్వహణకు విఘాతం కలిగించే వ్యవహారాలకు సంబంధించి పౌరులు ఎన్నికల అధికారులకు లేదా సమీపంలోని పోలీసు అధికారులకు సమాచారం అందించాలి.

–ఎస్. ఎల్లారెడ్డి, రిటర్నింగ్ అధికారి

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 28, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 12, క్యారెట్ 31, దొండ 13, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 13, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 53, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

రిజర్వేషన్ల పెంపుపై బీసీ గర్జనలో ప్రకటన చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రిజర్వేషన్ల పెంపుపై ఈ నెల 7న ఎల్బీ స్టేడియంలో జరిగే బీసీ గర్జన సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అదే తరహాలో జనాభా దామాషా ప్రకారం చట్ట సభలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. జనగణన, విద్య, ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటుకు కూడా ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈడిగ శ్రీనివాస్, మహేష్‌యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సికింద్రాబాద్ అభివృద్ధి



పద్మారావుకు హారతి ఇస్తున్న మహిళలు

చిలకలగూడ: రాజకీయాలకు అతీతంగా సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందని, ముస్లిం మైనార్టీలతో పాటు అన్నివర్గాల ప్రజలు తమవెంటే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తామని బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ, అక్బర్ హోటల్‌గల్లీ, మసీదు ఏరియా, శ్రీనివాసనగర్, వెంకటేశ్వరనగర్, మార్కండేయనగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలతో మూడోసారి విజయంతో హ్యాట్రిక్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో పద్మారావుకు హారతులతో స్వాగతం పలికారు. ప్రచారంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి, కార్పొరేటర్ హేమ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

చిలకలగూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు హర్దికర్ సత్యనారాయణ (కట్కసత్తి)తోపాటు పలువురు పద్మారావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో చిలకలగూడలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణ అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పద్మారావు విజయం కోసం తన వంతు కృషి చేస్తానని సత్యనారాయణ తెలిపారు. కార్పొరేటర్ సామల హేమ, నాయకులు రామేశ్వర్‌గౌడ్, జలంధర్‌రెడ్డి, కాసరబాద వెంకటేష్, డైమండ్ శ్రీను, గౌడ్‌శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పద్మారావుకు మద్దతు..

లాలాపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ గెలుపు కోసం ఆదివారం పద్మారావు తనయుడు త్రినేత్ర గౌడ్ ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నియోజక వర్గం అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న తన తండ్రి పద్మారావు గౌడ్‌ను మూడో సారి గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా వినోభానగర్ సంక్షేమ సంఘం నాయకులు పద్మారావు విజయానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినోభానగర్ సంక్షేమ సంఘం నాయకులు స్వామి, పరమేష్, మిట్టపల్లి శ్రీనివాస్, మహేశ్వరీ పాల్గొన్నారు.

అమీర్‌పేటలో నటుడు నవీన్‌చంద్ర సందడి



సాక్షి, సిటీబ్యూరో: అమీర్‌పేటలో సినీ నటుడు నవీన్‌చంద్ర సందడి చేశారు. శ్రీ లక్ష్మి లెజెండ్స్ అవుట్ ఫిట్టర్ వస్త్రాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షో రూమ్ నిర్వాహకుడు రాజు తనకు మంచి మిత్రుడని, అందుకే ఈ షో రూమ్ ప్రారంభించేందుకు వచ్చానని చెప్పాడు. ఇక్కడ అన్నీ లేటెస్ట్ ఫ్యాషన్ దుస్తులు చాలా బాగున్నాయన్నారు. తనకు ఈ మధ్యే కుమారుడు పుట్టాడని, షూటింగ్‌ల నుంచి విరామం తీసుకుని వచ్చి ఇక్కడ మరోసారి షాపింగ్ చేస్తానన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన అభిమానులతో నవీన్‌చంద్ర ముచ్చటించి ఫొటోలు దిగారు.

జాతి భవిష్యత్‌కు మాదిగలు సన్నద్ధం కావాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపేందర్ మాదిగ, దప్పు మల్లికార్జున్

బన్సీలాల్‌పేట్: జాతి భవిష్యత్..మనుగడ కోసం మాదిగల విశ్వరూప మహాసభకు కదం తొక్కాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు. ఈ నెల 11న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే విశ్వరూప మహాసభ కరపత్రం, పోస్టర్‌ను ఆదివారం హమాల్‌బస్తీలో ఎమ్మార్పీఎస్ నాయకులు పోతరాజు సాయికుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాదిగ, ఎమ్మెస్పీ సికింద్రాబాద్ కోఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తుదిదశకు చేరుకుందని మాదిగలు మహాసభకు తరలి రావాలన్నారు. సికింద్రాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరవుతున్నారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరుగుతున్న దండోరా ఉద్యమం ఎస్సీ వర్గీకరణ కోసం రాజీలేని పోరు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు నాగేశ్వరరావు, గోవింద్, నరేష్, రాజు, సాయిబాబా, కుమార్, నర్సింగ్‌రావు, యాదగిరి పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ సెంటినరీ డిగ్రీ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ఆడిటోరియంలో జరిగిన వేడుకలో హైదరాబాద్ ఆర్చి డయాసిస్ వైస్ చైర్మన్ రెవ. ఫా. యేరువ బాలశౌరి, ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మినారాయణ, ఎకాడమిక్ ఆడిట్ సెల్ డైరక్టర్ ప్రొ. నాగేష్, కళాశాల ప్రిన్సిపాల్ రెవ. ఫా డా వినయ్ ఆంథోని పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకొని కళాశాల, సమాజానికి తమ వంతు సేవ చే యాలన్నారు. ప్రిన్సిపాల్ ఆంథోని వినయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు అబ్దుల్ కలాం లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలన్నారు. పట్టాలు అందుకున్న విద్యార్థులు తమ సంతోషాన్ని తల్లిదండ్రులు, మిత్రులతో పంచుకున్నారు.

నలుగురు గంజాయి విక్రేతల రిమాండ్

అడ్డగుట్ట: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న యువకులను రిమాండ్‌కు తరలించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తుకారాంగేట్, టాస్క్‌ఫోర్స్ పోలీసుల వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లాలోని గుమ్మడిదల గ్రామానికి చెందిన అర్షద్ ఖాన్(21) ఇర్షాద్ ఖాన్(20) అన్నదమ్ములు. కొంతకాలంగా అర్షద్ ఖాన్ కొత్తగూడెంలోని మారేడుమిల్లిలో నుంచి అక్రమంగా గంజాయి కొనుగోలు చేసి నగరానికి వచ్చి విక్రయించేవాడు. ఇటీవల గంజాయి విక్రయాల గురించి ఇర్షాద్‌ఖాన్‌తో పాటు అతని స్నేహితులైన రామావత్ రాహుల్(21), మజర్ అహ్మద్(20)కు చెప్పాడు. నలుగురు కలిసి గంజాయి విక్రయించాలని పథకం వేసుకున్నారు. నాలుగు రోజుల క్రితం అర్షద్, రామావత్ రాహుల్ మారేడుమిల్లి గ్రామానికి వెళ్లి 5.6 కిలోల గంజాయిని సుఖ్‌దేవ్ నుంచి కొనుగోలు చేశారు. ఇర్షాద్, మజర్ అహ్మద్‌ను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రమ్మని చెప్పి అర్షద్, రాహుల్ కొత్తగూడెంలో రైలెక్కారు. లాలాగూడ రైల్వే స్టేషన్ వద్ద సిగ్నల్ పడడంతో అర్షద్, రాహుల్ అక్కడే దిగిపోయారు. ఇర్షాద్, మజర్‌లను లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని అడ్డగుట్టకు పిలిపించి 3.5 కిలోల గంజాయిని వాళ్లకు ఇచ్చి పంపించారు. సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్, తుకారాంగేట్ పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకొని గంజాయితో పాటు ఓ బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

వృద్ధుడి అదృశ్యం



ఓంప్రకాష్

లాలాపేట: ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం. మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన ఓంప్రకాష్(70)ఈ నెల 3న ఉదయం అదే బస్తీలో ఉండే తన కూతురి వద్ద టిఫిన్ చేసి వస్తానని వెళ్లి ఎంతకీ రాలేదు. బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉన్నత విలువలున్న నాయకులను ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న పెసల మస్తాన్‌రావు

సనత్‌నగర్: ప్రలోభాలకు దూరంగా ఉండి ఉన్నత విలువలు కలిగిన వారిని ఎమ్మెల్యేలుగా ఎన్నుకోవాలని విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పెసల మస్తాన్‌రావు కోరారు. 'ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడం ఎలా.?' అనే అంశంపై ఆదివారం జెక్‌కాలనీ గాంధీ పార్కులో జరిగిన చర్చావేదికలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు బూర్గుల రామకృష్ణారావు, వివాలాల గోపాలకృష్ణయ్య, దామోదరం సంజీవయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, తరిమల నాగిరెడ్డి, ప్రకాశం పంతులు లాంటి మహానుభావులు రాజకీయాలకు వన్నె తీసుకువచ్చారని కానీ.. ఇప్పుడు అవకాశవాద రాజకీయాలు పెరిగిపోవడంతో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రజలు డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లొంగి ఓటేయడంతో ప్రశ్నించే హక్కును కోల్పోతామన్నారు. ఓటర్లను లొంగదీసుకునేందుకు ఒక్కొక్కరూ కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, వాటిని తిరిగి సంపాదించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. ఎన్నికలు ఏవైనా సరే మంచి అభ్యర్థులను గెలిపించుకోవడం మనందరి చేతుల్లో ఉందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు నాయుడు, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, సభ్యులు ఆంజేయులు, ఇబ్రహీం, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజల తీర్పు.. కాంగ్రెస్ వైపు



లాలాపేట: అధికార పార్టీ అభ్యర్థిని ఎక్కడికక్కడ ప్రజలు అడ్డుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతూ తమ తీర్పును ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన మాణికేశ్వర్‌నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను గెలిచిన వెంటనే మాణికేశ్వర్ నగర్ వాసులకు ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 500 కే వంట గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతో పాటు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఇళ్లు లేని వారందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన నుంచి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ గెలుపు ఖాయం అయ్యిందన్నారు. ప్రచారంలో వేముల శ్రీనివాస్, ఆలకుంట లింగయ్య, లాజరస్, నర్సింహ్మా, వరికుప్పల రవి, అశోక్, మల్లేష్, కిట్టు, తరుణ్‌రెడ్డి, హన్మంత్, కె. శ్రీనివాస్, అమర్‌నాథ్‌గౌడ్, బ్రహ్మాజి పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో బీజేపీ గెలుపు ఖాయం



ప్రచారంలో పాల్గొన్న మేకల సారంగపాణి

చిలకలగూడ: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ విజయం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి మేకల సారంగపాణి అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్, ఫ్రైడే మార్కెట్, ఉప్పరిబస్తీ, మహ్మద్‌గూడ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్‌ను అభివృద్ధి చేయడంలో స్థానిక ఎమ్మెల్యే పద్మారావు విఫలమయ్యారని, సమస్యల నిలయంగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు గుణపాఠం తప్పదన్నారు. ప్రచారంలో నాగేశ్వరరెడ్డి, రాజేశ్వరరావు, హన్మంతుముదిరాజ్, మేకల కీర్తిహర్షకిరణ్, శ్యామ్, ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అన్ని వర్గాల మద్దతు



మాట్లాడుతున్న వెన్నెల

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి తనకు పూర్తి మద్దతు లభిస్తోందని కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెల తెలిపారు. ఆదివారం మడ్‌ఫోర్ట్‌లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. తన తండ్రి గద్దర్ ఆశయాలను నెరవేర్చేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజాసేవే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తన వెన్నంటే ఉన్నారన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ వారి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ మాట్లాడుతూ.. తానూ పార్టీ టికెట్ కోసం ప్రయత్నించానని అధిష్ఠానం వెన్నెలను అభ్యర్థిగా ఖరారు చేయడంతో ఆమెకు మద్దతుగా నియోజకవర్గంలో ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు శ్రీనివాస్, నిరంజన్, నాగేష్, బాలరాజు, బంగారు సదా పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం దళితులు ఉద్యమించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళితులంతా రాజ్యాధికారాన్ని సాధించే దిశగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో దసరా మిలాప్–2023ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన దళితులు, బడుగు, బలహీన వర్గాలు రాజ్యాంగానికి దూరంగానే ఉన్నారన్నారు. దళితులంతా ఐక్యంగా తమ హక్కుల సాధన కోసం పోరాటం చేయాలన్నారు. ఐక్యవేదిక నాయకులు గజ్జల సూర్యనారాయణ, గద్దం నవీన్‌కుమార్, రూపుల వివేక్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు గెల్వయ్య, కార్పొరేటర్ రచనశ్రీ, సుదర్శన్, పరిమళకుమార్, సిరిగిరి శ్యామ్, భీమనపల్లి రమేష్, పెద్దాపురం స్వామి, తిరుమల్, భాస్కర్, షరీఫ్ పాల్గొన్నారు.

ఆర్యసమాజంలో ఆయుర్వేద వైద్య శిబిరం



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి మేడిబావిలోని ఆర్యసమాజంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. వారాసిగూడ ఇందిరానగర్‌లోని ఆరోగ్యవర్ధిని ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆయుర్వేదిక్ వైద్యురాలు వర్ధిని నేతృత్వంలో వైద్య సిబ్బంది పంచకర్మ, డైటింగ్, న్యూట్రీషియన్ ఆహారం, మహిళలకు గర్భధారణ సమస్యలు, బీపీ, షుగర్, కీళ్ల నొప్పులకు సంబంధించి ఉచిత చికిత్సలు, పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

కాంగ్రెస్‌లో చేరిక

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజక వర్గానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ నేతృత్వంలో వివిధ పార్టీలకు చెందిన శిల్పాచారి, కొండల్ వెంకటేశ్వర్‌రావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

అడ్డగుట్ట: మతిస్థిమితం సరిగాలేని ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ దయాకర్ వివరాల ప్రకారం.. అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌కు చెందిన సరస్వతి(45)కి మతిస్థిమితం సరిగా ఉండదు. ఎర్రగడ్డలోని ఆస్పత్రిలో చికిత్స కూడా తీసుకుంటుంది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సరస్వతి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

7న బీసీల ఆత్మగౌరవ సభ

కాచిగూడ: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఎల్‌బీ స్టేడియంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటున్న బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని భారతీయ ఓబీసీ సమాఖ్య సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం బర్కత్‌పురాలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ... బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని, దేశాన్ని పరిపాలించడంలో ప్రధాని నరేంద్రమోదీ ఆదర్శంగా నిలిచారన్నారు. పార్టీ నేతలు శ్రీధర్, శ్రీనివాస్, రమేష్, ప్రసాద్, తిరుమల్, రాజేందర్, శ్యామ్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నల్లకుంట: నల్లకుంట టీఆర్టీ కాలనీలోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం కుసుమ హరనాథ మాసోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం రాధాకృష్ణులు, కుసుమ హరనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులచే నిర్వహించిన భజన ఆకట్టుకుంది. మధ్యాహ్నం భక్తులకు అన్న దానం చేశారు.

బీఆర్‌ఎస్ వీడనున్న మురళీకృష్ణ

అంబర్‌పేట్: బీఆర్‌ఎస్ పార్టీకి ఆ పార్టీ సీనియర్ నాయకుడు కె.మురళీకృష్ణ గుడ్‌బై చెప్పనున్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ఆదివారం ఆయన అంబర్‌పేటలో తెలిపారు. గత 32 సంత్సరాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్నానని, బీఆర్‌ఎస్ పార్టీలో నాయకులకు కనీస గౌరవం లేదని ఆయన ఆరోపించారు. తొమ్మిది సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగినా కనీస గుర్తింపు లేదన్నారు. త్వరలో టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతానన్నారు. అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి



పాదయాత్రలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: భాష, ప్రాంతం ఏదైనా ఇక్కడ నివసించే వారంతా తమ వారేనని బీఆర్‌ఎస్ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ పీజీరోడ్డు కాలనీస్, అపార్ట్‌మెంట్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇక్కడ స్థిరపడిన వారిలో ఆందోళన ఉన్నప్పటికీ సీఎం కేసీఆర్ తీసుకున్న పలు నిర్ణయాలతో వారు నిశ్చింతగా ఉంటున్నారన్నారు. సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, పీజీ రోడ్డు అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు కిషోర్, కార్యదర్శి సంజయ్, గిలానీ, జైన్ సమాజ్ అధ్యక్షుడు యోగేష్ జైన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలి..

పద్మారావునగర్: నిత్యం అందుబాటులో ఉన్న వారిని అక్కున చేర్చుకొని ఓటుతో ఆశీర్వదించాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పద్మారావునగర్ బెల్వెడర్ గార్డెన్‌లో ఆదివారం కాలనీ, అపార్టుమెంట్ వాసులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మారావునగర్ పరిసర ప్రాంతాల్లో అనేక ప్రజాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. కాలనీ, అపార్టుమెంట్ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను అందంగా తీర్చిదిద్దడంతో పాటు పార్కును సుందరీకరిస్తున్నట్లు వివరించారు. తలసాని సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో నగరం ఎంతో అభివృద్ధి సాధించిందని మరింత అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. పద్మారావునగర్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జగ్గయ్య, అంబరీష్, మహేష్ యాదవ్, సురేష్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం



బీఫారం అందుకుంటున్న కోట నీలిమ

సనత్‌నగర్: క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని పలు చర్చిలను ఆదివారం ఆమె సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మత పెద్దల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

- నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమకు ఆదివారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీఫామ్ అందజేసి శుభాభినందనలు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి సలీంఖాన్...

సనత్‌నగర్: బేగంపేటకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత సలీంఖాన్ ఆదివారం కోట నీలిమ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం కోట నీలిమ మాట్లాడుతూ.. వివిధ పార్టీలకు చెందిన నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని సనత్‌నగర్‌లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. అవినీతిపరమైన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

బేగంపేటలో ఇంటింటికీ ప్రచారం



కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ విజయానికి కృషి చేస్తామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బేగంపేట డివిజన్‌లోని అల్లంతోట బావిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌరపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేస్తూ కాంగ్రెస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. –సాక్షి, సిటీబ్యూరో